క్లుప్తంగా

అధికలోడ్‌తో వెళ్లే వాహనాలను సీజ్ చేయాలి

ఆత్మకూరు: డివిజన్ పరిధిలోని ఆత్మకూరు, నందికొట్కూరులోని వివిధ మండలాల్లో అధిక లోడ్‌తో ఇసుక, కంకర, బిలుకు టిప్పర్లు వెళ్తున్నాయని, వాటిని సీజ్ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు, బీఎస్‌పీ తాలూకా అధ్యక్షుడు స్వాములు కోరారు. పట్టణంలోని ఆర్టీఓ కార్యాలయంలో ఆర్టీఓ తిమ్మరసు రాయుడుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అధిక లోడ్‌తో టిప్పర్లు వెళ్తుండటంతో కర్నూలు–గుంటూరు రోడ్డు పాడై పోతుందన్నారు. నాయకులు ఇమానియర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

పగిడ్యాల: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 22వ తేదీన సీపీఐ చేపట్టిన మహాధర్నా కార్యక్రమాన్ని పురస్కరించుకొని సోమవారం పడమర ప్రాతకోట జగనన్న కాలనీలో పార్టీ నాయకులు రమేష్ పోరుబాట పోస్టర్లు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో చేపట్టిన ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న రూ. 1.80 లక్షలు చాలవని, లబ్ధిదారులు అప్పుల్లో కూరుకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, మండల కార్యదర్శి మజీద్ తదితరులు పాల్గొన్నారు.

చలో సిద్ధేశ్వరం

ఈ నెల 28న రాయలసీమ ప్రజాప్రదర్శన పేరుతో మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి చేపట్టిన చలో సిద్ధేశ్వరం, సంగమేశ్వరం పోస్టర్లను రాయలసీమ స్టీరింగ్ కమిటీ సభ్యులు చిన్న సుంకనన్న విడుదల చేశారు. బుధవారం మండలంలోని ముచ్చుమర్రి,నెహ్రూనగర్,పగిడ్యాల తదితర గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో స్వామన్న ,రాజు,స్వాములు,తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా ఈ-క్రాప్ నమోదు చేసుకోండి

జూపాడుబంగ్లా: రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఈ నెలాఖరులోగా ఈ క్రాప్ నమోదు చేయించుకొని వెంటనే ఈ-కేవైసీ చేయించుకోవాలని నందికొట్కూరు ఏడీఏ విజయశేఖర్ సూచించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నందికొట్కూరు నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా, నందికొట్కూరు, మిడ్తూరు, పగిడ్యాల మండలాల్లో 16,043 హెక్టార్లలో పలురకాల పంటలను రైతులు సాగుచేసినట్లు తెలిపారు. ఆయా మండలాల్లోని వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకొని ఆర్బీకేల సిబ్బందితో త్వరగా ఈక్రాప్ నమోదు, ఈ-కేవైసీ ఈ నెలాఖరులోగా వంద శాతం పూర్తిచేయించాలని ఆదేశించారు. ఖరీఫ్‌లో సాగుచేసిన పత్తి ప్రకృతి వైపరీత్యాల వల్ల దిగుబడి తగ్గిన మాటవాస్తవమేనని, ఈ విషయాన్ని శాస్త్రవేత్తలు ధ్రువీకరించటంతో పాటు పంటకోత ప్రయోగాల్లో కూడా వెల్లడైందన్నారు. ప్రభుత్వం నుంచి పత్తి సాగుచేసిన రైతులకు నష్టపరిహారం మంజూరయ్యే అవకాశాలున్నాయని తెలిపారు.

రైతులకు రశీదులు తప్పనిసరిగా ఇవ్వాలి



పురుగు మందుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ ఫణీశ్వరరెడ్డి

పాములపాడు: పురుగు మందుల దుకాణాల్లో కొనుగోలు చేసిన ఎరువులు, మందులు, విత్తనాలకు తప్పనిసరిగా రైతులకు రశీదులు ఇవ్వాలని ఏఓ ఫణీశ్వరరెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలో పురుగు మందుల దుకాణాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ప్రతి డీలర్ ఫామ్-10 తీసుకోవాలని చెప్పారు. రైతులు అనుమతులున్న దుకాణాల్లోనే కొనుగోళ్లు చేయాలని సూచించారు.

వేలంపాటలో పెరిగిన ఆదాయం

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన శ్రీదుర్గాభోగేశ్వర క్షేత్రంలో వివిధ దుకాణాల నిర్వహణకు బుధవారం నిర్వహించిన వేలంపాటలో ఆదాయం పెరిగినట్లు ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కళింగిరి పండ్లు అమ్ముకునేందుకు గతేడాది రూ.8800 ఉండగా ప్రస్తుతం రూ.10,500కు వేలంలో ఆదాయం వచ్చిందన్నారు. అలాగే చెరుకు అంగడి నిర్వహణకు గతంలో రూ.21,000 పోగా కొత్తగా రూ.27,000, ఐస్ కూల్‌డ్రింక్స్ అంగడి నిర్వాహణకు గతంలో రూ.26,000 ఉండగా రూ.29,500కు పాటదారులు దక్కించుకున్నారు. గతేడాది కంటే ఈ సంవత్సరం వేలాల్లో రూ.66,200 ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి కిరణ్‌కుమార్ రెడ్డి, అర్చకులు శ్యాంసుందర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న దృష్టిలో ప్రజలంతా సమానమే

- భేషజాలు చూపే ప్రసక్తే లేదు
- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- మద్దూరులో కొనసాగిన 'గడప గడపకు మన ప్రభుత్వం'



వృద్ధుడికి నమస్కరిస్తూ మాట్లాడుతున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

పాములపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ దృష్టిలో ప్రజలంతా సమానమేనని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రాష్ట్ర ప్రజలందరినీ సమానంగా చూస్తూ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. బుధవారం మండలంలోని మద్దూరు గ్రామంలో 2వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగించారు. గ్రామంలోని ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించి బుక్ లెట్‌ను అందజేశారు. గ్రామంలో ఏ సమస్య ఉన్నా పరిష్కారానికి చొరవ చూపుతామన్నారు. మద్దూరు గ్రామంలో విద్యుత్ ఉప కేంద్రం మంజూరైనట్లు తెలిపారు. సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగి సుఖసంతోషాలతో జీవితం గడపాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని వివరించారు. అనంతరం గడప గడపకు పాదయాత్ర నియోజకవర్గంలో చేపట్టి 100 రోజులు కావొస్తున్న సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు రాముడు ఇంటి వద్ద ఎమ్మెల్యే కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో సర్పంచు అఖ్తరున్నిసా, ఎంపీటీసీ బషీరాహ్మద్, తహసీల్దార్ రత్నరాధిక, ఎంఈఓ బాలాజీనాయక్, సొసైటీ చైర్మన్లు చౌడయ్య, ఎల్వీ రామణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు రామలింగేశ్వరరెడ్డి, రాములమ్మ, జబ్బార్, అంబయ్య, గౌస్, బాలీశ్వరరెడ్డి, రామలింగారెడ్డి, భీమ శేఖర్, గోవిందగౌడు, రమణారెడ్డి, శివలింగం, రాజన్న, ఉపేంద్ర, డైరెక్టర్ రామసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆపద్బాంధవుడు జగనన్న

జూపాడుబంగ్లా: ఆపదలో ఉన్న వారికి చేయూతనిచ్చే ఆపంద్బాంధవుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ కొనియాడారు. బుధవారం నందికొట్కూరు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపదలో ఉన్న వ్యక్తులు ఎవరైనా సీఎంకు ఎదురుపడితే చాలు స్వయంగా ఆయనే వారి వద్దకు వెళ్లి నేనున్నానంటూ అభయమివ్వడంతోపాటు వారికి అండగా నిలబడే మంచి మనస్సున్న వ్యక్తి అని అన్నారు. అనంతరం మిడుతూరు మండలంలోని తలముడిపి గ్రామానికి చెందిన ఎన్నం హిమజ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకోగా ఆమెకు సీఎం రిలీఫ్ ఫండు కింద మంజూరైన రూ.1.40లక్షల చెక్కును, సుంకేసుల గ్రామానికి చెందిన వడ్డెమాను సుబ్బలక్ష్మమ్మ మంజూరైన రూ.55వేల చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.



సీఎం రిలీఫ్ ఫండు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

అర్హులందరికీ ఉపాధి పనులు

మహానంది: గ్రామాల్లో అర్హులందరికీ ఉపాధి పనులు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఉపాధి హామీ పథకం ఏపీడీ బాలాజీ నాయక్ తెలిపారు. తిమ్మాపురం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే విధంగా పనులు చేయించనున్నట్లు తెలిపారు. పండ్లతోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ మనోహర్, సిబ్బంది వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల కల్పనకు చర్యలు

బండిఆత్మకూరు: ఉపాధి హామీ పథకం ద్వారా జాబు కార్డు ఉన్న కూలీలందరికి పనులు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీఓ వసుధ తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధఇ పనులపై సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా ఏ గ్రామంలో ఏఏ పనులు చేపట్టాలో సర్వే నిర్వహించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. దీనికి సంభందించిన ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో తీర్మానాలు చేసి పనులు మంజూరయ్యేలా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వాసుదేవ గుప్తా పాల్గొన్నారు.

పార్కింగ్ ప్రదేశాల పరిశీలన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఫిబ్రవరి 11 నుంచి 21వ తేదీ వరకు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా క్షేత్ర పరిధిలోని వివిధ ప్రదేశాల్లో పార్కింగ్ ప్రదేశాలను దేవస్థాన కార్యనిర్వాహణాధికారి ఎస్ లవన్న పరిశీలించారు. బుధవారం స్థానిక పోలీస్, దేవస్థాన అధికారులతో కలిసి యజ్ఞవాటిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఘంటామఠం వెనుక భాగం, దేవస్థాన ఆగమపాఠశాల ఎదురుగా ఉన్న ఆరుబయలు ప్రదేశం, ఆర్టీసీ బస్టాండ్, వాసవీ విహార్ తదితర ప్రదేశాలను సందర్శించారు. ఈఓ మాట్లాడుతూ పార్కింగ్ ప్రదేశాలలో గ్రావెల్ చదును పనులు వేగవంతం చేయాలని సూచించారు. అవసరం అయిన చోట్ల జంగిల్ క్లియరెన్స్ పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. పార్కింగ్ ప్రదేశాలన్నీ శుభ్రంగా ఉండేందుకు అవసరం అయిన చర్యలు చేపట్టాలని పారిశుద్ధ్య విభాగాన్ని ఆదేశించారు. పార్కింగ్ ప్రదేశాలలో మంచినీటి సదుపాయం, శౌచాలయాలు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని సూచించారు. అనంతరం గణేష్ సదనం పనులను పరిశీలించారు. ఆయన వెంట ఈఈ రామకృష్ణ, ఏఈఓ ఫణిధర్, డీఈఈ నరసింహారెడ్డి, పర్యవేక్షకులు అయ్యన్న, ఉద్యానవన అధికారి లోకేష్, తదితరులు పాల్గొన్నారు.



పార్కింగ్ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న దేవస్థానం ఈఓ, అధికారులు

ఇళ్ల నిర్మాణాల్లో జాప్యం తగదు

మిడుతూరు: జగనన్న లే అవుట్‌లో గృహాలు మంజూరైన లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను వేగవంతం చేసుకోవాలని, జాప్యం తగదని హౌసింగ్ డీఈ ప్రభాకర్, ఎంపీడీఓ జీఎన్‌ఎస్‌రెడ్డి, తహసీల్దార్ సిరాజుద్దీన్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మాసపేట, కలమందలపాడు, 49-బన్నూరు గ్రామాల్లోని జగనన్న లే అవుట్‌లను పరిశీలించారు. వారు లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇంటి నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులకు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉగాది లోపు నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రమేష్, పీఆర్ ఏఈ ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాసాపేట జగనన్న లే-అవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

సత్వరమే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోండి

జూపాడుబంగ్లా: జగనన్న కాలనీల్లో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరగా ఇళ్లనిర్మాణాలు పూర్తిచేసుకోవాలని ఎంపీడీఓ మంజులవాణి సూచించారు. బుధవారం ఆమె జూపాడుబంగ్లా జగనన్నకాలనీలో ఇళ్లనిర్మాణాలను పరిశీలించారు. ఆమె లబ్ధిదారులతో మాట్లాడుతూ ఎంత త్వరగా ఇళ్లు కట్టుకుంటే ప్రభుత్వం అంతే త్వరగా బిల్లులు మంజూరు చేస్తుందన్నారు. అనంతరం జూపాడుబంగ్లాలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీల సంఖ్యను పెంచాలని ఫీల్డ్ అసిస్టెంటును ఆదేశించారు. అలాగే జూపాడుబంగ్లా సచివాలయం-2ను తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరవ్వటంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ గోరీబాయి, ఈసీ నజీర్‌అహమ్మద్, సర్పంచ్ మొట్టెబాలస్వామి పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

నంద్యాల(సిటీ): క్రీడల్లో గెలుపు ఓటములు సమానమని, ఓడిపోయిన జట్టు కృంగి పోకుండా గెలుపే లక్ష్యంగా ముందుకు సాగితే విజయం వరిస్తుందని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. స్థానిక ఎస్పీజీ కళాశాల క్రీడామైదానంలో బుధవారం రాష్ట్ర స్థాయి శాప్ ఫుట్‌బాల్ లీగ్ ఫేజ్-2 పోటీలను ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో ఉన్నత క్రీడాకారులుగా మారేలా శ్రమించాలని కోరారు. అనంతరం స్టేట్ కన్వీనర్, శాప్ ఫుట్‌బాల్ లీగ్ సీనియర్ శిక్షకుడు సిరాజుద్దీన్ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో మొదటిసారి ఫుట్‌బాల్ లీగ్ జరగడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు రాజు, ఎస్పీజీ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్, జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, పీడీలు పాల్ విజయ్‌కుమార్, ఏనుగుమర్రి పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన

కొత్తపల్లి: బ్యాంకింగ్ పేరిట ఆన్‌లైన్‌లో జరిగే మోసాలపై బుధవారం మండల పరిధిలోని గువ్వలకుంట్ల గ్రామంలో రిజర్వ్ బ్యాంక్ డిపాజిటర్ ఎడ్యుకేషన్ అవేర్‌నెస్ ఫండ్, కెనరా బ్యాంకు సౌజన్యంతో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కర్నూలు వారి ఆధ్వర్యంలో కళాజాత బృందం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా బ్యాంకు పథకాలు, డిజిటల్ బ్యాంకింగ్, ఆన్‌లైన్ మోసాలు, సుకన్య సమృద్ధి యోజన, అటల్ పెన్షన్, పీఎంజెజెబీవై, పీఎంఎస్‌బీవై, ఈశ్రమ కార్డులు, లేబర్‌కార్డులు, సైబర్ క్రైమ్‌లపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీజీబీ మేనేజర్ నందకిషోర్, ఎస్ఎస్‌టీ డిస్ట్రిక్ట్ కో -ఆర్డీనేటర్ అశోక్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల మాటలను ప్రజలు నమ్మి మోసపోవద్దని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌టీ కౌన్సిలర్లు కె.రాజు, టి.శివనాగరాజు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కేఆర్‌ఎంబీ కర్నూలులో ఏర్పాటు చేయాలి



దీక్ష చేస్తున్న రైతు సంఘాల నాయకులు

నంద్యాల(అర్బన్): శ్రీశైలం ప్రాజెక్టు ఉన్న కర్నూలులోనే కృష్ణా నది యాజమాన్య బోర్డు ఏర్పాటు చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి కోరారు. కేఆర్‌ఎంబీని కర్నూలులోనే ఏర్పాటు చేయాలంటూ బుధవారం రైతు సంఘాల నాయకుల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట రాయలసీమ ధర్మదీక్ష చేపట్టారు. సమితి ఉపాధ్యక్షుడు వైఎన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన దీక్షలో దశరథరామిరెడ్డి మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల నీటి వినియోగం, విద్యుత్ ఉత్పత్తికి కీలకమైనది శ్రీశైలం రిజర్వాయర్ అన్నారు. కృష్ణా జలాల నిర్వహణ, వినియోగంపై పర్యవేక్షణకు శ్రీశైలం రిజర్వాయర్ అత్యంత కీలకమైందన్నారు. కేఆర్‌ఎంబీని కర్నూలులోనే ఏర్పాటు చేస్తే సీమ రైతాంగానికి సాగునీటి లభ్యతలో న్యాయం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కర్నూలు చంద్రశేఖర్‌రెడ్డి, కోటిరెడ్డి, వేణుగోపాలరావు, రామకృష్ణారెడ్డి, రమణ, హరినాథరెడ్డి, నాగన్న, అరుణ్, పాని, మల్లికార్జున, రవి, మధుసూదన్‌రెడ్డి, కొండారెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలి

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలోని పలు ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు జవహర్‌నాయక్ కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆశ్రమపాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక గిరిజన విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. తల్లితండ్రులు మూఢనమ్మకాలు, నిరక్షరాస్యత వలన చిన్నారులకు సుదూర ప్రాంతాల పాఠశాలలకు పంపడం లేదన్నారు. ఫలితంగా వీరు విద్యార్థి దశలోనే అడవిబాటపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలెంచెరువు ఆశ్రమ పాఠశాల నుంచి ఇటీవల నలుగురు ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారన్నారు. ఇక్కడ గణితం, భౌతిక, జీవశాస్త్రం బోధించే ఉపాధ్యాయులు లేరని చెప్పారు. అలాగే శ్రీశైలం ఆశ్రమ పాఠశాలలో 1నుంచి 5వ తరగతి వరకు ఒక్కరు, 6, 7 తరగతులు బోధించేందుకు ఒక టీఆర్‌టీ ఉపాధ్యాయురాలు మాత్రమే ఉన్నారన్నారు. శివపురం ఆశ్రమపాఠశాలలో ఐదు మంది ఉపాధ్యాయులు ఈ ఏడాది డిప్యుటేషన్‌పై వెళ్లడంతో విద్యార్థులకు విద్య అందడం లేదన్నారు.

బోట్లలో ప్రయాణం చేయకుండా చూడాలి

కొత్తపల్లి: సింగోటం రథోత్సవం సందర్భంగా మండలం నుంచి ఎక్కువ సంఖ్యలో భక్తులు బోట్లపై కృష్ణా నది దాటేందుకు ప్రయత్నిస్తారని, ఎవరు కూడా బోటు ప్రయాణం చేయకుండా పోలీసులు, రెవెన్యూ సిబ్బంది జాగ్రత్తగా బందోబస్తు విధులు నిర్వర్తించాలని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. బుధవారం సంగమేశ్వరం, సిద్ధేశ్వరం, జానాల గూడెం ఘాట్లను తనిఖీ చేశారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించేందుకు ప్రయత్నిస్తే సమాచారం ఇవ్వాలని, వారిపై కేసులు నమోదు చేసి బోట్లు సీజ్ చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా పాతమాడుగుల గ్రామంలో కూడా బోటుపై ప్రయాణం చేస్తే సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. గ్రామంలో సింగోటం జాతరకు వెళ్లిన వారి గురించి ఆరా తీశారు. అందరూ ఆర్టీసీ బస్సుల్లోనే వెళ్లారని గ్రామస్తులు తహసీల్దార్‌కు తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ శేషారామ్‌సింగ్, కానిస్టేబుల్ సుదర్శన్, వీఆర్వోలు రహిమాన్, అశోక్ ఉన్నారు.



సంగమేశ్వరం ఘాట్ వద్ద ప్రజలతో మాట్లాడుతున్న తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్

బస్సుల్లో సింగోటం బయలు దేరిన భక్తులు

పగిడ్యాల : తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూలు జిల్లా సింగోటం గ్రామంలో జరిగే లక్ష్మీ నరసింహస్వామి రథోత్సవ వేడుకలకు భక్తులు బుధవారం ఆర్‌టీసీ బస్సుల్లో బయలుదేరారు. గతంలో కృష్ణానదిలో ఇంజిన్‌బోట్లలో భక్తులు తరలివెళ్లేవారు. అయితే బోటు ప్రయాణంపై నిషేధం విధించడం వల్ల భక్తులు ఆర్‌టీసీ బస్సుల్లో బయలుదేరారు. నందికొట్కూరు డిపో నుంచి సింగోటం జాతరకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు ఆర్‌టీసీ అధికారులు స్పష్టం చేశారు. అర్లపాడు, మూర్వకొండ ఘాట్లవద్ద ఇంజిన్ బోట్లు తిప్పకుండా ముచ్చుమర్రి ఎస్ఐ, రెవెన్యూ అధికారులు బందోబస్తు కొనసాగిస్తున్నారు. బందోబస్తును తహసీల్దార్ భారతి పర్యవేక్షించారు.

తండాల సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

నంద్యాల(అర్బన్): జిల్లాలోని గిరిజన తండాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ కోరారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఆయన జిల్లా కలెక్టర్‌ను కలిశారు. అనంతరం గిరిజన తండాల్లో ప్రజలు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. గిరిజనుల ఆచార వ్యవహారాలతో పాటు గ్రామాల్లో మౌలిక వసతులు, తాగునీరు తదితర సమస్యలను సత్వరమే పరిష్కరించాలని విన్నవించారు. జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌తో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

అంతర్జాతీయ చిత్ర కళ పోటీల్లో ప్రతిభ

నంద్యాల(అర్బన్): తూర్పుగోదావరి జిల్లా అమలాపురంలోని కోన సీమ చిత్రకళా పరిషత్ వారు ఈనెల 15న నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి బాలుర చిత్రలేఖనం పోటీల్లో నంద్యాలకు చెందిన కోటేష్ ఆర్ట్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ చూపి గోల్డ్ మెడల్స్ సాధించారని అకాడమీ నిర్వాహకులు కోటేష్ తెలిపారు. పతకాలు, ప్రశంసా పత్రాలు పొందిన చిన్నారులను బుధవారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ పోటీలకు 21మంది చిన్నారులు వేసిన చిత్రాలను పంపగా.. భవతి, వాసంతి, సాయి హాసీస్, సాహిత్, సాత్విక్, ఉమేష్ గుప్త, మంజునాథ్, హేమకేష్, నాగ శేషయనారెడ్డి, నిఖిల్‌కు గోల్డ్ మెడల్, సర్టిఫికెట్లు, 11 మందికి మెరిట్ అవార్డ్స్ వచ్చాయని చెప్పారు. నిర్వాహకులు కొరియర్ దద్వారా పంపిన గోల్డ్ మెడల్స్, సర్టిఫికెట్లు అందుకున్నామని వివరించారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు

మహానంది:మండల కేంద్రమైన తిమ్మాపురం, అబ్బీపురం గ్రామాల్లో బుధవారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. కర్నూ లు నుంచి వచ్చిన అధికారులు గ్రామాల్లో పర్యటించి అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిసింది. ఇటీవల బొల్లవరం గ్రామంలో దాడులు చేసిన విషయం తెలిసిందే.

నేటి నుంచి మొబైల్ ఆధార్ క్యాంపులు

పగిడ్యాల: మండలంలోని ఆయా గ్రామాల్లో ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు ఆధార్ నమోదుకు మొబైల్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ బుధవారం తెలిపారు. మొబైల్ ఆధార్ క్యాంపులను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈనెల 19వ తేదీన ఎం ఘనపురం, 20న పడమర ప్రాతకోట, 21న లక్ష్మాపురం, 23న పగిడ్యాల, 24న సంకిరేణిపల్లె గ్రామాల్లో ఆధార్ క్యాంపులు ఉంటాయని వెల్లడించారు.

మొక్కజొన్న వైపే మొగ్గు

- రబీలో పెరిగిన విస్తీర్ణం
- వరి కంటే ఎక్కువగా సాగు

ఆత్మకూరు: ఈ ఏడాది ఆత్మకూరు డివిజన్ పరిధిలోని అన్ని మండలాలలో రబీ సీజన్‌లో రైతులు మొక్కజొన్న పంటపై ఆసక్తి పెంచుకున్నారు. వరి పంట కంటే ఎక్కువగా సాగుచేశారు. గతేడాది ప్రొద్దు తిరుగుడు వేసిన రైతులు సైతం మొక్కజొన్న వేసేందంకు శ్రీకారం చుట్టారు. ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడుతో పాటు వెలుగోడు మండలాలలో ఈ పంటను సాగుచేశారు.

మార్కెట్‌లో గిట్టుబాటు ధర

ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన మొక్కజొన్న పంటకు కోత దశ అనంతరం గిట్టుబాటు ధర లభించడ, ప్రైవేట్ వ్యాపారులు అధికమొత్తంలో కొనడంతో రైతులు మళ్లీ మొక్కజొన్న పంటలకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం క్వింటాల్ రూ.1,900 నుంచి రూ.2,000 లకు పైగ ఉండడంతో రైతులు దీని వైపు దృష్టి సారించారు. ఆత్మకూరు మండలంలో 2,440 హెక్టార్లు, కొత్తపల్లి మండలంలో 1681, పాములపాడు మండలంలో 1451, కొత్తపల్లిలో 2150, వెలుగోడు మండలంలో 300 హెక్టార్లలో మొక్కజొన్న పంటను సాగు చేశారు.

కత్తెర పురుగుకు భయపడని రైతులు

ఈ పంటకు కత్తెర పురుగు వ్యాపిస్తుంది. అయినప్పటికీ రైతులు రసాయనిక , క్రిమిసంహారక మందులు వాడుతూ పంటను రక్షించుకుంటున్నారు. పంటకు కత్తెర పురుగు ప్రారంభమైన వెంటనే క్రిమిసంహారక మందులు స్ప్రే చేయడంతో పాటు ప్రొక్లైన్, నువాన్ తదితర మందులు పిచికారీ చేస్తూ పంటను కాపాడుకుంటున్నారు. రైతులు మొక్కజొన్న పండితే ఎకరానికి 20 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చినా చాలని భావిస్తున్నారు.



ఆత్మకూరు సమీపంలో మొక్కజొన్న పైరు

‘ఉపాధి’ కూలీల సంఖ్య పెంచండి

జూపాడుబంగ్లా: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించి కూలీల సంఖ్య పెంచాలని డ్వామా జిల్లా మానిటరింగ్ మరియు ఎవాల్యూయేషన్ అధికారి భాస్కర్‌నాయుడు, ఏపీడీ అన్వరాబేగం ఆదేశించారు. బుధవారం వారు తంగడంచ గ్రామంలో ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి కూలీలతో మాట్లాడి వారి నుంచి వివరాలు సేకరించారు. అనంతరం జూపాడుబంగ్లా ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఈసీ, టీఏ, ఫీల్డ్‌అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. అడిగిన వారందరికీ పనులు చూపాలని ఏపీఓ గోరీబాయి, టీఏలు, ఫీల్డ్‌అసిస్టెంట్లను ఆదేశించారు. జూపాడుబంగ్లా మండలంలో నిత్యం 3వేల మందికి ఉపాధి పనులు కల్పించాల్సి ఉండగా కేవలం 500 మందికి మాత్రమే పనులు చూపడం దారుణమన్నారు. ఇలాగే కొనసాగితే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మంజులవాణి, ఏపీఓ గోరీబాయి, ఉపాధిసిబ్బంది పాల్గొన్నారు.

కూలీలందరికీ పనులు కల్పించాలి

పగిడ్యాల: దరఖాస్తులు చేసుకున్న కూలీలందరికీ పనులు కల్పించాలని ఎంపీడీఓ వెంకటరమణ ఆదేశించారు. బుధవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబాన్ని అధార్‌కార్డును అనుసంధానం చేయాలని, ఈ ప్రక్రియను శనివారంలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ మద్దిలేటి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డుకు ఆధార్‌ను అనుసంధానించండి

కొత్తపల్లి: జాబ్‌కార్డు కలిగిన ప్రతి వ్యక్తికి ఆధార్‌కార్డుతో అనుసంధానం చేయాలని ఐటీడీఏ ఏపీఓ రాజునాయక్ సూచించారు. బుధవారం స్థానిక ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి మునగ మొక్కలను పంపిణీచేసి వాటిని నాటించే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. మొక్కలు నాటుకొనే కుటుంబాలను గుర్తించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు.



తంగడంచలో ఉపాధికూలీలతో మాట్లాడుతున్న ఎంఅండ్‌డీ భాస్కర్‌నాయుడు, ఏపీడీ అన్వరాబేగం

మదర్సాలో తాగునీటి బోరుకు మరమ్మతులు

జూపాడుబంగ్లా: నందికొట్కూరు పట్టణంలోని రాజావీధిలో ఉన్న అయేషా నిస్వాన్ ఉర్దూ, అరబిక్ మదర్సాలోని తాగునీటి బోరుకు రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ అబ్దుల్‌షకూర్ మరమ్మతులు చేయించి తాగునీటి సమస్యను నివారించారు. మదర్సాలోని బోరు పనిచేయకపోవడంతో నీటిసమస్య తలెత్తింది. విషయం తెలుసుకున్న ఆయన మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో స్టాంపర్ హాజీ అబ్దుల్ హమీద్, అబ్దుల్‌ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.



మరమ్మతులు పనులు పర్యవేక్షిస్తున్న ఉర్దూ అకాడమి డైరెక్టర్ అబ్దుల్‌షకూర్, తదితరులు